క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి

ఆసిఫాబాద్అర్బన్: సంకష్టహర చతుర్థి పర్వదినం పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి దేవాలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామావళి, మన్యుస్తోత్రం, అభిషష్టకం, మంగళహారతి, మహా మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. చతుర్థి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేసి రాత్రి 9.40 గంటలకు చంద్రోదయం తర్వాత ఉపవాస దీక్షలు విరమించారు.

గోరింటాకు సంబరాలు


గోరింటాకు సంబరాల్లో పాల్గొన్న మహిళలు

దహెగాం: ఆషాఢ మాసం వచ్చిందంటే మహిళలకు ముందుగా గుర్తు వచ్చేది గోరింటాకు పెట్టుకోవడం. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు గోరింటాకు పెట్టుకుంటారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో మహిళలు గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా కన్వీనర్‌గా శశికిరణ్


ఇంగు శశికిరణ్

రెబ్బెన: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని నంబాల గ్రామానికి చెందిన ఇంగు శశికిరణ్‌ను ఎంపిక చేశారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్న సోమశేఖర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ కోరారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యం రద్దీగా ఉండడంతో గ్రామస్తులు, పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.

ఓటర్ జాబితా అందుబాటులో ఉంచుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రమోద్

కౌటాల: బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లు బూత్‌స్థాయి ఓటరు జాబితా అందుబాటులో ఉంచుకోవాలని తహసీల్దార్ ప్రమోద్ అన్నారు. సోమవారం కౌటాల రైతువేదికలో బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. సర్వేకు వెళ్లినప్పుడు ఓటర్లతో ఎలా మాట్లాడాలో వివరించారు. గ్రామానికి చెందిన ఓటరు ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడితే కుటుంబ సభ్యులకు ముందుగా నోటీసు ఇచ్చి వారం రోజుల తర్వాత పేరు తొలగించాలన్నారు. పకడ్బందీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో అధికారులు సంతోష్, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణం


పనులు పరిశీలిస్తున్న మరప బాజీరావు

కెరమెరి: మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుణ్యక్షేత్ర ఆలయంలో ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణం పనులను చేపడుతున్నట్లు జంగుబాయి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మరప బాజీరావు తెలిపారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట సభ్యులు చిత్రు, విజయ తదితరులు ఉన్నారు.

కరెంట్ కట్‌తో తిప్పలు!

- గ్రామాలు 156.. విద్యుత్ సబ్‌స్టేషన్ ఒక్కటే
- నానాటికీ పెరుగుతున్న వినియోగం
- తరుచూ సరఫరాలో అంతరాయం
- మరో విద్యుత్‌సబ్‌స్టేషన్ కావాలని వేడుకోలు


కెరమెరిలోని విద్యుత్ సబ్‌స్టేషన్


కెస్లాగూడలో కర్ర స్తంభాలు

కెరమెరి: కరెంట్ తీగ తడిచినా.. చిరుగాలి వీచినా.. చినుకులు కురిసినా మండలంలో కరెంట్ కట్ అవుతుంది. దీంతో వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రజలు విసుగుచెందుతున్నారు. పెద్ద మండలానికి ఒక్కటే సబ్‌స్టేషన్ ఉండడంతో ఏ చిన్న సమస్య తలెత్తినా మండలం మొత్తం కరెంట్ పోతోంది.

ఒక్కటే సబ్‌స్టేషన్..

విస్తీర్ణంతో పాటు భౌగోళికంగా అతిపెద్దగా ఉన్న కెరమెరి మండలంలో మొత్తం 156 గ్రామాలు ఉన్నాయి. అందులో గృహ వినియోగానికి సంబంధించిన విద్యుత్ మీటర్లు సుమారు 4324లకు పైగా ఉండగా వ్యవసాయ మీటర్లు 508 ఉన్నాయి. వీటన్నింటికి ఒకే 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. దీంతో ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది వచ్చినా మండలం మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఫలితంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటికి కలిపి 5 ఫీడర్లు ఉన్నాయి. ఏ ఫీడర్‌లో అంతరాయం ఏర్పడిన అందరికి ఇబ్బంది కలుగుతుంది. తరుచుగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఇటీవల 5.0 ఎంవీఏ సామర్థ్యం కలిగినా పీటీఆర్‌లు బిగించారు.

30 ఏళ్ల క్రితం నిర్మాణం..

సుమారు 30 ఏళ్ల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. అప్పుడు 2200 గృహాలకు సంబంధించిన విద్యుత్ మీటర్లు ఉండగా, 20 వ్యవసాయ మీటర్లు ఉండేవి. విద్యుత్ మీటర్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. అన్ని రకాల విద్యుత్ మీటర్లు పెరగడంతో పాటు అదేస్థాయిలో వినియోగం కూడా పెరిగింది. కానీ విద్యుత్ సబ్‌స్టేషన్ మాత్రం పెరగలేదు. దీంతో ఒకేదానిపై ఎక్కువ లోడు పడడంతో అంతరాయం ఏర్పడుతుంది. ఎన్నికలకు ముందు సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగిన విద్యుత్ ప్రస్తుతం తరుచూ అంతరాయం ఏర్పడడంలో ఆంతర్యమేంటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

అనేకసార్లు అంతరాయం..

మండలంలో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఎన్నిసార్లు కరెంటు పోతుందో.. వస్తుందో అంతుపట్టని పరిస్థితి ఉంది. పురాతన లైన్లు, కరెంట్ స్తంభాలు ఉండడంతో సమస్యలు కలుగుతున్నట్లు తెలుస్తోంది. నూతనంగా ఇన్సులేటర్లు అమర్చుతున్నప్పటికీ నాణ్యతగా ఉండడం లేవని అందుకే ఇబ్బందులు కలుగుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కాగా విద్యుత్ లైన్లు కూడా అత్యంత దూరంగా ఉండడం, సరిపడా సిబ్బంది లేకపోవడం కూడా మరో కారణంగా చెబుతున్నారు. జోడేఘాట్, పరందోలి, అంతాపూర్, శంకర్‌లొద్ది వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మరమ్మతులు చేసేందుకు కనీసం 24 గంటల సమయం పడుతోంది.

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తాం. సబ్‌స్టేషన్ ఒక్కటే ఉండడంతో ఇబ్బంది తప్పడం లేదు. మీటర్ల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. పెద్దలైను కారణంగా ఎక్కడ అంతరాయం ఏర్పడినా మండలంలో కరెంటు పోతుంది. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు.

– రమేశ్, ఏఈ, విద్యుత్‌శాఖ

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి


భట్టుపల్లి రోడ్డు పరిశీలిస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి, అందవెల్లి ప్రధాన రహదారిపై రోడ్డు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం భట్టుపల్లి శివారులోని గుంతలమయమైన రోడ్డును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. గుంతలమయమైన రోడ్డు సమస్య కోర్టులో ఉన్నందున ఆలస్యమైందని, కోర్టులో కేసు ముగిసిందని, వర్షాకాలం పూర్తయ్యాక పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ కృష్ణ, ఏఈ మణిరాజ్, నాయకులు గణపతి, తిరుపతి, మొండి, రామన్న, సత్తన్న, రమేశ్, పోచయ్య, గ్రామస్తులు ఉన్నారు.

వాలీబాల్ విజేత ‘రవిచంద్ర కాలనీ’


బహుమతి ప్రదానం చేస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లోని టాటియా గార్డెన్స్ మైదానంలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొనగా రవిచంద్రకాలనీ జట్టు సోమవారం జరిగిన ఫైనల్‌లో విజేతగా, పాడిబండ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు సీఐ బుద్దె రవీందర్ షీల్డుతో పాటు పతకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలి


సభ్యత్వ రశీదు అందజేస్తున్న అనిల్‌కుమార్

రెబ్బెన: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పీఆర్టీయూ సంఘం విశ్వాసం, భరోసాతో ముందుకు సాగుతోందన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రవీణ్, మండల అధ్యక్షుడు బత్తుల సదానందం, మండల ప్రధాన కార్యదర్శి రేగల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


కేజీబీవీలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

వాంకిడి: కేజీబీవీ, యూఆర్ఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, పీఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు పరిచి ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యుఆర్ఎస్ ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని, ఆప్షనల్, రెండో శనివారం సెలవులు వర్తింపజేయాలన్నారు. అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గయ్య, మండల అధ్యక్షుడు బండె హరీశ్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి రాజలింగు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతి


కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న రమేశ్

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్ రమేశ్ రాథోడ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి విభాగంలో దరఖాస్తులు సమర్పించారు. అనార్‌పల్లి నుంచి కరంజావాడ (గోండ్‌గూడ) వరకు బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని, పరంధోళి నుంచి మహరాజ్‌గూడ వరకు ఐదు కిలో మీటర్లు బీటీ రోడ్డు వేయాలని కోరారు. కరంజివాడలోని నాగోబా పూజారి బొజ్జు పటేల్ ఇంటి వరకు బీటీ రోడ్డు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కోరగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆమె తెలిపారు. ఆయన వెంట కుమురం విజయ్ ఉన్నారు.

జీవో 49 వెంటనే రద్దు చేయాలి


ఎఫ్ఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

కెరమెరి: ఆదివాసీలకు, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వారికి విఘాతం కలిగించేలా ఉన్న జీవో నంబర్ 49 వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ బీమేశ్వర్, ఎఫ్ఆర్‌వో మజారోద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. పేసా చట్టం 1996 ప్రకారం 49 జీవోను రద్దు చేయాలన్నారు. అడవులు, ఖనిజాలు వంటి సహజ వనరుల నియంత్రణలో పేసా గ్రామ సభకు అధికారాలు ఉంటాయని పేర్కొన్నారు. పేసాను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, ఆదివాసీ సంఘాల నాయకులు మడావి భరత్, కనక ప్రభాకర్, సోము, జంగు, బొజ్జిరావు, రాజేశ్వర్, రాంకిషన్ తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: జీవో 49ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రమోద్‌కు ఆదివాసీలు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జీవో 49తో ఆదివాసీలు పోడు భూములపై హక్కులు కోల్పోతారన్నారు.ఈ జీవోతో 333 ఆదివాసీల గ్రామాలను వేరే ప్రాంతాలకు తరలించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఫారెస్ట్ అధికారులు ఆదివాసీల భూముల జోలికి వస్తే చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. జీవోను రద్దు చేయకుంటే తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. తుడుందెబ్బ కమిటీ నాయకులు సుగుణాకర్, బాపురావ్, భరత్, విఘ్నేశ్, ప్రవీణ్, చరణ్‌దాస్, బావుజీ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన


మొట్లగూడలో పంటలు పరిశీలిస్తున్న ఏవో

దహెగాం: మండలంలోని మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్ గ్రామాల్లో పంటలను సోమవారం ఏవో రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాణహిత వరద వల్ల నీట మునిగిన పత్తి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వరద నీరు తగ్గిపోవడంతో పత్తి మొక్కలు మురిగి పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

పరుచుకున్న పచ్చదనం..!


ఖర్జెల్లి-గూడెం మార్గంలో..

చింతలమానెపల్లి: కొద్ది రోజుల క్రితం వరకు ఆకులు రాలి బోసిపోయిన అడవులు ఇటీవల కురుస్తున్న వర్షాలతో పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో దట్టమైన అడవులు ఆయా మండలాలు వెళ్లే రహదారులపై ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి), చింతలమానెపల్లి మండలం ఖర్జెల్లి నుంచి గూడెం, కదంబా మీదుగా కాగజ్‌నగర్, కౌటాల -ముత్తంపేట మార్గంలో ప్రయాణికులకు ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి.


సిర్పూర్ -కాగజ్‌నగర్ మార్గంలో..


కౌటాల సమీపంలో..

పోస్ట్ మెట్రిక్ వసతిగృహం పనులు పూర్తిచేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం పనులు పూర్తి చేయాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు సోమవారం జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి దినకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రూ.2.9 కోట్లతో నిర్మిస్తున్న వసతి భవనం పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. విద్యుత్, పెయింటింగ్ పనులు చేస్తే వినియోగంలోకి వస్తుందన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.

కల్వర్టుకు మరమ్మతు


మరమ్మతులు చేస్తున్న కోనేరు అభిమానులు

బెజ్జూర్: మండలంలోని సోమిని గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రెండు లోలెవెల్ కల్వర్టులకు కోనేరు అభిమానులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. కొన్నేళ్ల నుంచి చెత్తాచెదారంతో పాటు ఇసుక పేరుకుపోయి ఉందని గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఆయన జేసీబీ పంపించి మరమ్మతులు చేయించారు. బెజ్జూర్ నుంచి సోమిని వరకు ఉన్న ప్రధాన రహదారికి వారం రోజుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలని వారు పేర్కొన్నారు. లేకుంటే 4 గ్రామ పంచాయతీల ప్రజలు, నాయకులు, బెజ్జూర్ మండల కేంద్రంలో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్రం సాయన్న, లంగారి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

‘పేదలకు గూడు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం’


భూమిపూజ చేస్తున్న విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన: గూడు లేని పేదలకు గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని వంకులం, జక్కులపెల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ సర్పంచ్ ప్రేందాస్, నాయకులు అనిల్, మొండయ్య, నానాజీ, చంద్రశేఖర్, విశ్వనాథ్, సంతోష్ పాల్గొన్నారు.

కేజీబీవీకి ప్రహరీ కరువు



లింగాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీకి ప్రహరీ కరువైంది. అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంతో కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులకు కనీస రక్షణ కరువైంది. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేజీబీవీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. – లింగాపూర్